క్లుప్తంగా

గుత్తి సబ్ జైలు తనిఖీ



జైలును తనిఖీ చేస్తున్న జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ రాజశేఖర్

గుత్తి: పట్టణంలోని స్పెషల్ సబ్ జైలును మంగళవారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎస్.రాజశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జైలులోని బ్యారెక్‌లు, బాత్ రూమ్‌లు, స్టోర్ రూమ్, వంట గదులు పరిశీలించారు. అనంతరం ఆయన ఖైదీలతో మాట్లాడారు. జైల్లో సదుపాయాలు ఎలా ఉన్నాయని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఖైదీలు జైలు నుంచి బయటకు వెళ్లాక గొడవల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో జైలు అధికారి మహేశ్వరుడు, ప్యానెల్ న్యాయవాది గంగాధర్ కుమార్, కోర్టు సిబ్బంది సాదిక్ వలి తదితరులు పాల్గొన్నారు.

స.హ.చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

గార్లదిన్నె/యాడికి: గార్లదిన్నె మండలంలోని కొప్పలకొండలో వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి డీఏఓ ఉమామహేశ్వరమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీఏఓ మాట్లాడుతూ అధికారుల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి సమాచారహక్కు చట్టం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం వరి,జీలుగ, పంటలను పరిశీలించి, వాటి ఉపయోగాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఓ సోమశేఖర్, ఏఈఓ హరి, వీహెచ్ఏ ఆమని, ఎంఈఓ రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే యాడికిలోని సంత మార్కెట్‌లో ఉన్న రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై ఏఓ మహబూబ్‌బాషా రైతులకు అవగాహన కల్పించారు.

అశ్వత్థంలో సజావుగా వేలం



వేలం నిర్వహిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

పెద్దపప్పూరు: మండలంలోని అశ్వత్థ నారాయణస్వామి క్షేత్రంలో మంగళవారం టెంకాయలు, తలనీలాలు, కొబ్బరి చిప్పలు, హోటల్ నిర్వహణ హక్కుల కోసం దేవదాయ శాఖ అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. అనంతపురానికి చెందిన రేవతి తలనీలాల హక్కులకు రూ.8,51,000, టెంకాయల వేలం రూ.8,55,500, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు రూ.2,19,000కు హక్కులు పొందారు. హోటల్ నిర్వహణకు కర్నూలు జిల్లా బూరుగల గ్రామానికి చెందిన ఆనంద్ అనే వ్యక్తి రూ.1.75 లక్షలకు హక్కులు పొందినట్లు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వన్నూర్‌స్వామి, ఈఓ సుబ్రమణ్యం తెలిపారు. మాఘమాసం విడిదినాల్లో మాత్రమే వేలం పాటదారులకు హక్కు ఉంటుందని వారు వివరించారు.

హుండీ కానుకల లెక్కింపు

పెద్దపప్పూరు: మండలంలోని అశ్వత్థంలో మంగళవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వన్నూరుస్వామి, ఈఓ సుబ్రమణ్యం నేతృత్వంలో భక్తులు స్వామివారికి సమర్పించిన ముడుపులు, కానుకలను లెక్కించారు.నారాయణ స్వామి కట్టపై ఏర్పాటుచేసిన పర్మినెంటు హుండీ ద్వారా రూ.5,73,846లు ఆదాయం వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. చిన్నపప్పూరు గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవకుల సదస్సు



ప్రముఖ ప్రసంగీకుడు తిమోతిరావుతో పాస్టర్లు

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న రాక్ చర్చిలో మంగళవారం సేవకుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు గుత్తి, పామిడి, గార్లదిన్నె, గుంతకల్లు, యాడికి, జొన్నగిరి పాస్టర్లు, దైవ సేవకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రముఖ ప్రసంగీకుడు రెవరెండ్ డాక్టర్ తిమోతిరావు, జిల్లా పాస్టర్స్ సొసైటీ సభ్యుడు రెవ యేషయా మాట్లాడుతూ ప్రపంచంలో ఏసు ప్రభువుకు మించిన దేవుడు లేడన్నారు. అందరూ ఏసయ్యను ప్రార్థించాలన్నారు. అనంతరం దైవ సేవకులు, పాస్టర్లు దైవ ఆశీర్వాదం పొందారు. కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సాలోమెన్, గౌరవ సలహాదారుడు డేవిడ్ నాయక్, గౌరవ కార్యనిర్వాహక అధ్యక్షుడు గాబ్రియేల్ ప్రసాద్, అధ్యక్షుడు మాథ్యూ, ఉపాధ్యక్షుడు చంద్రసేన, సెక్రటరీ అనిల్ బాబు, జాయింట్ సెక్రటరీ చంద్రశేఖర్, కోశాధికారి శేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్.. టెన్షన్



- స్పౌజ్ పింఛన్ల పంపిణీలో జాప్యం
- ఆందోళనలో వృద్ధులు
- పట్టించుకోని అధికారులు

తాడిపత్రి రూరల్: కూటమి ప్రభుత్వం వృద్ధుల జీవితాలతో చెలగాటమాడుతోంది. పేరుకు స్పౌజ్ పింఛన్ల మంజూరు చేశామని చెపుతున్నా.. వాటి పంపిణీలో ఎందుకు జాప్యం చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి. స్పౌజ్ పింఛన్ల కోసం అర్హులైన వృద్ధులు ఎదురు చూస్తున్నారు. వృద్ధాప్య పింఛన్ వస్తూ భర్త చనిపోతే స్పౌజ్ (భాగస్వామ్య) పింఛన్‌ను భార్యకు మంజూరు చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఈ మధ్యకాలంలో స్పౌజ్ పింఛన్లు మంజూరయ్యాయని అధికారులు చెబుతున్నారు. నిధులను కూడా కేటాయించారని, అయితే పంపిణీపై ఎలాంటి ఆదేశాలు రాలేదంటున్నారు. ఈ పింఛన్ల కోసం లబ్ధిదారులు మునిసిపాలిటీ, ఎంపీడీఓ కార్యాలయాలు, గ్రామ వార్డు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పింఛన్ల పంపిణీ మా చేతుల్లో లేదని, ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే పంపిణీ చేస్తామని చెపుతున్నారని బాధితులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రచారంలో ఉన్న శ్రద్ధ ఆచరణలో లేకపోవడంతో వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. తాడిపత్రి నియోజవర్గంలో దాదాపు 500కు పైగా స్పౌజ్ పింఛన్లు మంజూరయ్యాయి. తాడిపత్రి మునిసిపాలిటీ 112, తాడిపత్రి మండలం 109తో పాటు పెద్దపప్పూరు, యాడికి, పెద్దవడుగూరు మండలాల్లో వంద చొప్పున పింఛన్లను కూటమి ప్రభుత్వం మంజూరు చేస్తూ సంబంధిత శాఖలకు పంపింది. ఇందుకు సంబంధించి రూ.20 లక్షలకుపైగా నిధులు అవసరం అవుతాయి. ఈ నిధులకు పరిపాలన అనుమతులు రావాల్సి ఉంది. దీంతో అధికారులు తమ వద్దకు పింఛన్ల కోసం వచ్చే లబ్ధిదారులకు సమాధానం చెప్పలేక సతమతమవుతున్నారు.

ఆర్భాటపు హామీలతో అధికారం

ఎన్నికల సమయంలో అర్హులైన వారందరికి వృద్ధాప్య పింఛన్లను పంపిణీ చేస్తామని ఆర్భాటపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కొత్తగా ఒక పింఛన్ కూడా పంపిణీ చేయలేదు. వృద్ధులతో పాటు 50 సంవత్సరాలు నిండిన వారికి కూడా పింఛన్ల పంపిణీ జరుగుతుందని అమలు కానీ హామీ ఇచ్చింది. ఈ హామీకి ఆశ పడి ఓట్లు వేసిన వారికి మొండిచేయి చూపుతోంది. భర్త చనిపోయి కుటుంబ పోషణ బరువైన మహిళలకు వితంతు పింఛన్ల మంజూరు చేయలేదు. వీరందరూ కార్యాలయాల చుట్టు తిరగడంతోనే కొత్త ప్రభుత్వం ఏడాదికి పైగా సమయం గడిచింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పలు రకాల పింఛన్ల మంజూరు చేసి, అర్హులందరికీ న్యాయం చేసింది. కూటమి ప్రభుత్వం మాత్రం కొత్త పింఛన్ల జోలికి వెళ్లడం లేదు.

అనుమతి రాగానే పంపిణీ చేస్తాం



స్పౌజ్ పింఛన్ల పంపిణీకి ప్రభుత్వ అనుమతి కోసం ఎదురు చూస్తున్నాం. ఉత్తర్వులు వచ్చిన తరువాత వృద్ధులకు పింఛన్లను పంపిణీ చేస్తాం.తాడిపత్రి మునిసిపాలిటీ పరిధిలో 112 స్పౌజ్ పింఛన్లు మంజూరయ్యాయి.

– శివరామక్రిష్ణ, మునిసిపల్ కమిషనర్

మోసం చేయడం చంద్రబాబు నైజం



ఓబుళాపురంలో క్యూఆర్ కోడ్ పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



గంగాదేవిపల్లిలో రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పుట్లూరు: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేశారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి రమణాయాదవ్ అన్నారు. మంగళవారం వారు మండలంలోని సంజీవపురం, ఓబుళాపురం, దోశలేడు గ్రామాల్లో 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు సహా కూటమి నాయకులు ఇచ్చిన హామీలు, గెలుపొందిన అనంతరం వారు మాట్లాడుతున్న మాటలను ప్రజలకు వివరించారు. సూపర్ సిక్స్ పథకాలను గాలికి వదిలేశారన్నారు. కూటమి ప్రభుత్వం కేవలం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ, ప్రశ్నించేవారి గొంతు నొక్కుతోందని విమర్శించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ప్రజలతో మొబైల్ ఫోన్లలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ స్కాన్ చేయించి మోసాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, ఎల్లుట్ల పవన్, పెద్దిరాజు, విశ్వనాథరెడ్డి, తిరుపతయ్య, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: మండలంలోని గంగాదేవిపల్లిలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులు సర్పంచ్ హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వారు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ఎన్నికల ముందు చేసిన హామీలను గుర్తు చేశారు. అనంతరం కుటుంబ సభ్యుల సెల్‌ఫోన్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అమలు కాని హామీలను వివరించారు. టీడీపీ నాయకుల మోసాలను నిలదీయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ప్రచారకమిటీ సభ్యుడు గంగిరెడ్డి, గంగారాజు, శివ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలు కూడా వినరా?



మాట్లాడుతున్న ఆంజనేయులు

బుక్కరాయసముద్రం: రాష్ట్ర హోంశాఖ మంత్రి దళితుల సమస్యలు కూడా వినరా అంటూ వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు మంత్రి ఆంజనేయులు మండిపడ్డారు. మంగళవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో దళిత సంఘం నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత సామాజిక వర్గానికి చెందిన రాష్ట్ర హోం శాఖ మంత్రి జిల్లాకు వచ్చి కనీసం దళితుల సమస్యలు కూడా వినక పోవడం దారుణమన్నారు. ఇటీవల కాలంలో జిల్లాలో దళితులపై దాడులు, మహిళలపై అత్యాచారాలు వంటి సంఘటనలను విన్నవించడానికి వెళ్తున్న దళిత సంఘం నేతలను అధికారం అడ్డు పెట్టుకుని ఎక్కడికక్కడే పోలీసుల ద్వారా కట్టడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేడ్కర్ పేరు చెప్పుకుని దళితులతో ఓట్లు వేయించుకుని, గెలిచిన అనంతరం దళితులనే వెన్నుపోటు పొడుస్తారా? అని మండి పడ్డారు. జిల్లాలోని రాప్తాడు నియోజక వర్గంలో ఏడు గుర్రాలపల్లిలో దళిత మైనర్ బాలికపై 14 మంది కలసి అత్యాచారం జరిగితే కనీసం బాధిత కుటుంబాన్ని పరామర్శించలేక పోవడం దారుణమన్నారు. జిల్లాలో ఇద్దరు దళిత ఎమ్మెలు ఉన్నా దళితులపై జరుగుతున్న దాడులను ప్రశ్నించక పోవడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా దళితులపై జరుగుతున్న అన్యాయాలు, దాడులు, దౌర్జన్యాలపై నోరు విప్పి మాట్లాడాలన్నారు. లేనిపక్షంలో దళిత సంఘం నేతల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భాస్కర్, నియోజకవర్గ ఎస్సీసెల్ మహిళా అధ్యక్షురాలు, బీకేఎస్ సర్పంచ్ పార్వతి, దుర్గం సర్పంచ్ సాకే రామాంజనేయులు, నాగేంద్ర, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మకు బోనాల సమర్పణ



బోనాలు మోసుకెళ్తున్న భక్తులు. (ఇన్‌సెట్‌లో) అలంకరణలో రేణుకా యల్లమ్మ అమ్మవారు

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో ఉన్న రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ఆషాఢ మాసం మంగళవారం బోనాల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుంచి రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని రక రకాల పూలతో చక్కగా అలంకరించారు. భక్తులు ప్రతి ఇంటి నుంచి వడిబియ్యం తెచ్చి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. బెనకల బావిలో గంగ పూజ చేశారు. ఈ సందర్భంగా యువకులు డాన్స్‌లు చేస్తూ భక్తులను అలరించారు. ముఖ్యంగా డాక్యుమెంటరీ హీరో విజయ భాస్కర్ అదిరిపోయే స్టెప్పులు వేసి అందరినీ ఆశ్చర్య పరిచారు. అనంతరం ప్రతి ఇంటి నుంచి బోనాలు తీసుకొచ్చారు. ఊరి వాకిలి(నగరేశ్వరాలయం) వద్ద నుంచి రేణుకా ఎల్లమ్మ ఆలయం వరకూ మేళ తాళాలు, మంగళవాయిద్యాలతో బోనాలను ఊరేగించారు. అనంతరం బోనాలను రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

వీఆర్ఎస్ బకాయిలు చెల్లించాలి



మస్తానయ్య సమాధికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: ఏసీఎస్ మిల్లు కార్మికులకు బకాయిపడ్డ వీఆర్ఎస్ బకాయిలను చెల్లించేలా చూడు స్వామి అంటూ మస్తానయ్యను కార్మిక పోరాట సంఘం నాయకులు వేడుకున్నారు. మంగళవారం ఉరుసు సందర్భంగా మిల్లు కార్మిక పోరాట సంఘం అధ్యక్షుడు టీసీ నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లికార్జున, జనరల్ సెక్రటరీ వీరన్న, కోశధికారి కే.ఆదిశేషులు నేతృత్వంలో మస్తానయ్యకు కొబ్బరి, చక్కర చదింపులు, ప్రత్యేక ప్రార్థలను చేశారు. అనంతరం ఓ వినతి పత్రాన్ని ముజావర్లు ద్వారా మస్తానయ్య స్వామి సమాధి వద్ద ఉంచి ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించేలా చూడు స్వామీ అంటూ వేడుకున్నారు. వారు మాట్లాడుతూ మిల్లు కార్మికులకు వీఆర్ఎస్ కింద రూ.5.53 కోట్లు బకాయిల కేసు విషయమై హైకోర్ట్, జిల్లా లేబర్ కోర్టులో విజయం సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే చెల్లింపు విషయంలో మిల్లు చైర్మన్, జిల్లా కలెక్టర్, మేనేజింగ్ డైరెక్టర్లు, సంబంధిత విభాగాల అధికారులు స్పందించి బకాయిలను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు చిన్న మునయ్య, నాగన్న, సత్తార్, బండయ్య, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

'అక్రమ అరెస్టులతో పోరాటాలను ఆపలేరు'

గుంతకల్లుటౌన్: అక్రమ అరెస్ట్‌లతో ప్రజా పోరాటాలను ఆపలేరని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్ అన్నారు. రాజమండ్రిలో ఆంధ్రా పేపర్ మిల్లు కార్మికులకు న్యాయం చేయాలని ఆమరణ దీక్షకు సిద్ధమైన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను అర్ధరాత్రి హౌస్ అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రా పేపర్ మిల్లు యాజమాన్యం, కూటమి ప్రభుత్వం జోక్యం చేసుకుని కార్మికుల న్యాయపరమైన కోర్కెలను పరిష్కరించకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామన్నారు.

హంద్రీనీవా జలాలకు హారతి

గుంతకల్లు రూరల్: కర్నూలు జిల్లా మల్యాల నుంచి బయలుదేరిన కృష్ణా జలాలు మంగళవారం ఉదయం మండలంలోని కసాపురం వద్ద అనంతపురం జిల్లాలోకి ప్రవేశించాయి. దీంతో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం హంద్రీనీవా కాలువ వద్దకు చేరుకుని కృష్ణా జలాలకు హారతి ఇచ్చి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తొమ్మిదో రోజుకు చేరిన రిలేదీక్ష

పామిడి: పామిడిలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఐక్య మాదిగ సమాజ్ ఆధ్వర్యంలో ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ కోసం వంద గంటల రిలే నిరాహార దీక్షలు మంగళవారం తొమ్మిదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంకరాజుకాలువ వెంకటేష్‌తో పాటు రాజ్‌కుమార్, కేశవ, సూర్యప్రకాష్‌రెడ్డి, ఎంసీ నాగరాజు, ఎంసీ నాగరాజు, సుదర్శన్ రిలే దీక్షలో కూర్చొన్నారు.

పోస్టు కార్డుల ప్రదర్శన

పెద్దపప్పూరు: ఆర్డీటీకి కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్ఏను పునర్దురించాలని కోరుతూ మంగళవారం పెద్దపప్పూరు, గార్లదిన్నె ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ చేశారు. ఆర్డీటీ సభ్యులు, అభిమాన సంఘం నేతల నేతృత్వంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి పోస్టుకార్డులు రాశారు. ఆ లేఖలను బుధవారం సచివాలయంలో సమర్పించి కేంద్ర ప్రభుత్వానికి చేర్చాలని అధికారులకు విన్నవించనున్నట్లు విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీటీ సిబ్బంది, ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని బళ్లారిరోడ్ వద్ద ఉన్న ఎండీజీ ఇంజనీరింగ్ వర్క్స్ అండ్ వెల్డింగ్‌షాపులో రెండు రోజుల క్రితం చోరీకి పాల్పడిన ఉమామహేశ్వరనగర్‌కు చెందిన దూదేకుల ఇమామ్ అనే దొంగను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. దొంగ నుంచి రూ.1.80 లక్షల విలువ చేసే ఆటోమొబైల్ వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు. ఎస్ఐ కొండయ్య, సిబ్బంది వెళ్లి షాపులో అమర్చిన సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించి దొంగను గుర్తించారన్నారు.

ఎనుముల అపహరణ

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని సంజీవపురంలో రైతులు ఓబిరెడ్డి, భాస్కర్‌రెడ్డికి చెందిన రెండు ఎనుములను దుండగులు సోమవారం రాత్రి అపహరించారు. దాదాపు రూ.2 లక్షలు నష్టపోయామని బాధితులు వాపోయారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

నేడు మండల సమావేశం

గార్లదిన్నె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ వెంకటనారాయణ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు.మంగళవారం ఎంపీడీఓ మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వ శాఖల పనితీరుపై చర్చిస్తామన్నారు. అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, సమావేశానికి హాజరు కావాలన్నారు.

కాశీకి భస్మం తరలింపు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని హిందూ శ్మశాన వాటికలో పునరుద్ధరణ చర్యల్లో భాగంగా సర్వకుల శల్య భస్మాన్ని మంగళవారం ప్రత్యేక వాహనంలో కాశీకి తరలించారు. కొన్ని రోజుల క్రితం శ్మశాన వాటికలోని సమాధులను తొలగించగా భూమి లోపలి అస్థికలు బయటకు వచ్చాయి. వాటిని రాసిగా పోసి దహనం చేశారు. దహనం చేయగా వచ్చిన భస్మాన్ని సంచుల్లోకి నింపారు. ప్రత్యేక వాహనంలో కాశీకి తరలించి అక్కడ పూజలనంతరం గంగానదిలో నిమజ్జనం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

అచ్యుతానందన్ ఆశయాలను కొనసాగిస్తాం

గుంతకల్లుటౌన్: ప్రముఖ కమ్యూనిస్టు నేత, కేరళ మాజీ సీఎం వి.ఎస్.అచ్యుతానందన్ ఆశయాల సాధనకు పాటుపడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి అన్నారు. మంగళవారం ఆ పార్టీ కార్యాలయంలో అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డి.శ్రీనివాసులు, రమేష్, సురేంద్ర, రామునాయక్, వై.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కేసీ నారాయణకు నివాళి

గుంతకల్లు: పట్టణంలోని శ్రీ శంకరనందగిరి స్వామి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు కేసీ నారాయణ తృతీయ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కసాపురం రోడ్డులోని డిగ్రీ కళాశాలలో కేసీ నారాయణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ గోపాల్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సురేష్‌బాబు, అధ్యాపకులు వెంకటరమణ, క్రిష్ణయ్య, గోపి, డాక్టర్ వరప్రసాద్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయం తనిఖీ



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: పట్టణంలోని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయాన్ని మంగళవారం ఆశాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తనిఖీ చేశారు. ముందుగా ఆయన రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో నవోదయం 2.0 కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గంజాయి, నాటుసారా తయారీ, రవాణాపై చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారి రామమ్మోహన్‌రెడ్డి, సీఐ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్చకులపై రాజకీయాలు చేయొద్దు



మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

శింగనమల: శింగనమలలోని దుర్గాంజనేయ దేవాలయం అర్చకులను తొలగించాలని కొందరు రాజకీయాలు చేయడం తగదని విశ్వహిందూపరిషత్ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వర్‌రెడ్డి, అఖిల భారత బ్రహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ ఖండించారు. మంగళవారం శింగనమలలోని దుర్గాంజినేయ దేవాలయాన్ని వారు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. దుర్గాంజినేయ ఆలయం అర్చకులు వంశపార్యపరంగా పూజలు చేస్తున్నారన్నారు. కానీ అలయ అభివృద్ధి పేరుతో అర్చకులను బయటకు పంపడానికి కొందరు రాజకీయాలు చేస్తున్నారన్నారు. అలయం అభివృద్ధి చేయాలనుకుంటే ఎవరికి అభ్యంతరం లేదని, అర్చకులను వెళ్లిపోవాలని, భయపెట్టడం, తిట్టడం వంటివి పద్దతి కాదన్నారు , ఇలాగే చేస్తే అర్చకుల తరుపున ఉద్యమం చేయాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన బాట

పామిడి: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో కూటమి అలసత్వం వీడాలని, లేనిపక్షాన ఆందోళన బాట పట్టాల్సి ఉంటుందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాయల వెంకటేష్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక హరిజనవాడ స్కూల్‌లో నిర్వహించిన మండలశాఖ కార్యవర్గ సమావేశానికి ఆయనతో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, రాష్ట్ర మాజీ కార్యదర్శి బి.నరసింహులు హాజరై మాట్లాడారు. 12వ పీఆర్‌సీని తక్షణం అమలు చేయాలన్నారు. లేనిపక్షాన 30 శాతం మధ్యంతర భృతి విడుదల చేయాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. బోధనేతర కార్యక్రమాలతో ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేస్తూ ఇతరత్రా కార్యక్రమాలతో కాలం వెళ్ళదీస్తున్న ప్రభుత్వం తీరుపై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బీ వెంకటరమణ, పామిడి మండలశాఖ అధ్యక్షుడు నూర్‌మహమ్మద్, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, సతీష్‌కుమార్, మల్లికార్జున, సంహన్న, వివేకానంద, జిలాన్, కృష్ణమూర్తి, గంగాధర్ పాల్గొన్నారు.

పామిడి సీఐ ఔదార్యం

పామిడి: రోడ్డుపై పడిపోయిన వృద్ధురాలిని ఆస్పత్రికి చేర్చి సీఐ ఔదార్యం చాటుకున్నారు. వివరాలు.. పట్టణంలో మంగళవారం భిక్షాటన చేస్తూ ఓ వృద్ధురాలు స్పృహతప్పి రోడ్డుపై పడిపోయింది. అటుగా వెళ్తున్న సీఐ వీ యుగంధర్ గమనించి తన పెట్రోలింగ్ వాహనాన్ని ఆపాడు. సీఐ స్వయంగా రోడ్డుపై పడిపోయిన వృద్ధురాలిని పోలీసు రవీంద్ర, డ్రైవర్ క్రాంతితేజ సహకారంతో స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రికి చేర్చి వైద్యసేవలు అందింపజేశారు. ఈ సందర్భంగా సీఐ ఔదార్యంపై ప్రజలు ప్రశంసల జల్లు కురిపించారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం

యాడికి: మండలంలోని నగరూరు, వేములపాడు గ్రామ సచివాలయాల్లో ఇటీవల బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులను ఆయా గ్రామాల సర్పంచులు రుక్మాంద రెడ్డి, ఓంకారమ్మల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బదిలీ అయిన నగరూరు సచివాలయ సిబ్బంది బాబయ్య, అమర్ నాథరెడ్డి, బాలకృష్ణ, రేవతి, రమాదేవి, విజయ్‌ను సర్పంచు రుక్మాంద రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్‌నాయకుడు భోగాతి బ్రహ్మానందరెడ్డి, నాగేశ్వరరెడ్డి, ఆదినారాయణరెడ్డి శాలువాలు పూలమాలలతో ఘనం గా సత్కరించారు. అలాగే వేములపాడు గ్రామ సచివాలయం వద్ద సిబ్బంది విజయలక్ష్మి, సతీష్‌బాబు, కిరణ్‌కుమార్, మంజునాథ్, దివ్యను సర్పంచు ఓంకారమ్మ, నాయకుడు సాంబశివుడు సత్కరించారు. పంచాయతీ కార్యదర్శులు సుమలత, మహేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయబృందం

పామిడి: మండలంలోని ఖాదర్‌పేట జెడ్పీహైస్కూల్‌లో మంగళవారం రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం చేపట్టారు. గత ఆదివారం అనంతపురం జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్-జూనియర్, జూనియర్ సెలెక్షన్ పోటీల్లో వారు ప్రతిభ కనబరిచారు. సబ్-జూనియర్స్ బాలికల విభాగంలో ఆర్.ప్రణయ, జి.భవాని, ఎల్.సుచిత్ర, జూనియర్ బాలికల విభాగంలో ఎల్.మానస ఎంపికైనట్లు హెచ్ఎం కె.పురుషోత్తమ్ బాబు, పీడీ ఎస్.శిరీష, ఉపాధ్యాయులు తెలిపారు. త్వరలో సత్యసాయి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారన్నారు.

వానరం సమాధికి పూజలు

తాడిపత్రి రూరల్: మండలంలోని అక్కన్నపల్లి సమీపంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరాంజనేయులు ఆధ్వర్యంలో వానరం సమాధికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2003లో మృతి చెందిన ఓ వానరానికి సమాధి కట్టి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆషాఢ మాసం మంగళవారాన్ని పురస్కరించుకు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆర్‌సీ రజనీకాంత్‌రెడ్డి, చక్రపాణి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

యల్లనూరు: మండల కేంద్రం సమీపంలో అయ్యప్ప స్వామి గుడి వద్ద కర్ణాటక మద్యం తరలిస్తున్న లావనూరు అమర్‌నాథ్‌ను అరెస్టు చేసినట్టు ఏఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపారు. అతడి నుంచి 12 బెంగళూరు విస్కీ (180 ఎంఎల్) బాటిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.